క్లుప్తంగా

వేంకటాద్రి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



వెంకన్న ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 90 రోజుల్లో భక్తులు నగదు రూపంలో స్వామివారికి రూ.6 లక్షల 25 వేల 541లు సమర్పించినట్లు ఈవో నీలిమ తెలిపారు. ముందుగా ఆలయ అర్చకుడు మహర్షి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. లెక్కింపులో పర్యవేక్షణాధికారి పీఎల్ఎన్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ మహాలక్ష్మి

పరవాడ: మహిళల భద్రతపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు పరవాడ పోలీసులు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు విద్యార్థినులు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఎస్ఐ మహాలక్ష్మి అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఆపద సమయంలో 112 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. శక్తి యాప్ వినియోగం, కాలేజీ, బస్టాండ్‌లలో ఎదురయ్యే ఈవ్‌టీజింగ్ పరిస్థితులు, బ్లాక్ మెయిల్, సోషల్ మీడియా మోసాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు. వేధింపులకు పాల్పడుతున్న ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల అధ్యాపకుడు శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా అయిత



పెందుర్తి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌గా పులగానివాని పాలెం మాజీ సర్పంచ్ అయిత సింహాచలం నియమితులయ్యారు. సంఘ సభ్యులుగా గొరపల్లి పంచాయతీ కరకవానిపాలేనికి చెందిన చిరికి అవతారం, గుర్రంపాలేనికి చెందిన ఉగ్గిన అచ్చిబాబు నియమితులైనట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ఆయా పదవుల్లో ఏడాది పాటు కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయిత సింహాచలం మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు.

అబాకస్‌లో విద్యార్థి ప్రతిభ



హేమానికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవరావు, హెచ్‌ఎం శిరీష

పెందుర్తి: ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి 9వ మ్యాథ్స్ అబాకస్ పోటీల్లో నాయుడుతోట రవినగర్ భాష్యం విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ సాధించింది. 2,500 మంది పాల్గొన్న ఈ పోటీలో పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న కృష్ణ హేమానిక సింగ్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాఘవరావు, హెచ్‌ఎం శిరీష విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: పెదముషిడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి లంకెలపాలెంలో విద్యుత్ పరమైన మరమ్మతులతో పాటు జంగిల్ క్లియరెన్స్ నేపథ్యంలో ఈ నెల 18న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెదముషిడివాడ, మార్కండేయ కాలనీ, సిద్ధివినాయకనగర్, తులసీనగర్, కన్నూరు, మంత్రిపాలెం, లంకెలపాలెం, గంజిపేట, వినాయకనగర్, శ్రీరామనగర్, గంగిరెడ్ల కాలనీ, లంకెలపాలెం పాత గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సబ్బవరం: మండలంలోని సెక్షన్-1 సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్బవరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకూ సబ్బవరం జోడుగుళ్ల జంక్షన్, పెదనాయుడుపాలెం, గొల్లలపాలెం, ఆదిరెడ్డిపాలెం, చిన్నయ్యపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

'నరవలో గ్రావెల్ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. స్థానిక కూటమి నాయకులు ముందుండి మరీ అక్రమ తవ్వకాలు జరిపిస్తున్నారు. ఈ ప్రాంతంలో నగరానికి, పరిశ్రమలకు నీరందించే గోదావరి, రైవాడ పైప్‌లైన్లతోపాటు, గ్యాస్ పైప్‌లైన్ కూడా ఉంది. ప్రస్తుతం అక్కడే రేయింబవళ్లు తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల పైప్‌లైన్లు బయటకు కనిపిస్తున్నాయి. ఈ తవ్వకాలను ఇలానే కొనసాగిస్తే **పైప్‌లైన్లను కూడా పూర్తిగా తవ్వేసి నగరానికి చుక్క నీరు లేకుండా చేసేలా ఉన్నారు'**

ఇదీ నరవ ప్రాంత ప్రజల ఆవేదన

నరవను దోచేస్తున్నారు!



- ప్రభుత్వ, ఏపీఐఐసీ భూముల్లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు
- కూటమి నాయకుల ధనదాహానికి ప్రమాదకరంగా పైప్‌లైన్లు
- దెబ్బతినే స్థితికి నగరానికి, పరిశ్రమలకు నీరందించే పైప్‌లైన్లు
- కాసుల వేటలో ప్రమాదాలను గుర్తించని కూటమి నాయకులు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, జీవీఎంసీ యంత్రాంగం

పెందుర్తి: దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్న చందంగా.. అధికార కూటమికి చెందిన గ్రావెల్/మట్టి దొంగలు జీవీఎంసీ 88వ వార్డు నరవను పంచేసుకున్నారు. గ్రామ స్థాయిలోని టీడీపీ, జనసేన నాయకులు నరవలో రేయింబవళ్లు అక్రమ తవ్వకాలకు పాల్పడుతూ రూ.కోట్లు విలువైన ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. అందులో వాటాలను 'ముఖ్య'నేతకు అందిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఈ అక్రమ తవ్వకాల కారణంగా నగర ప్రజలతో పాటు అనేక పరిశ్రమలకు నీరందించే పైప్‌లైన్లకు ప్రమాదం వాటిల్లే పరిస్థితులు తలెత్తుతున్నాయి.

పైప్‌లైన్లకు పొంచివున్న ప్రమాదం

కాసుల వేటే ప్రధానంగా జరుగుతున్న గ్రావెల్ దందాలో 'పచ్చ'మూక ప్రధాన వాటర్, గ్యాస్ పైప్‌లైన్లు ఉన్న ప్రాంతంలోనే యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. జీవీఎంసీ పర్యవేక్షణలో ఉండే గోదావరి, రైవాడ పైప్‌లైన్ పైపులు ఇప్పటికే వీరి తవ్వకాలకు బయటపడుతున్నాయి. తవ్వకాలకు యంత్రాలు వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ పైప్‌లైన్లు ఏమాత్రం పగిలినా ఆ నష్టం అంచనాలకు అందదు. అయినా అధికారులు అటువేపు దృష్టి సారించని పరిస్థితి. నరవలో మట్టి దొంగల నుంచి వాటాలు తీసుకుంటూ సహకారం అందిస్తున్న ఓ కూటమి ప్రజాప్రతినిధితో పాటు యంత్రాంగం కూడా 'మన్నుతిన్న పాముల్లా'మిన్నకుండిపోవడంపై స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

పట్టించుకోని అధికార యంత్రాంగం

నరవ సర్వే నెం.1తో పాటు సర్వే నెం.7(70 ఎకరాల ఏపీఐఐసీ భూమి), 29, 27/8లలోని వందల ఎకరాల ప్రభుత్వ, గయాలు భూముల్లో కూడా టీడీపీ–జనసేన నాయకులు అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ముఖ్యంగా స్థానిక టీడీపీ నేత ఆధ్వర్యంలో ఆయా భూముల్లో పట్టపగలే మట్టిని తరలిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వాటర్ పైప్‌లైన్లు బయటకు కనిపించేలా గ్రావెల్‌ను తవ్వేశారు. ఒకవేళ అనుకోకుండా ఈ పైప్‌లైన్లకు ఏదైనా ప్రమాదం వాటిల్లితే నీరందక స్టీల్‌ప్లాంట్, సెజ్‌లలోని పరిశ్రమలతో పాటు నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇంత జరుగుతున్నా ఇక్కడి మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం 'మామూళ్ల'గా ఊరకుండిపోతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.



నరవలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు బయటపడిన రైవాడ పైప్‌లైన్

రెచ్చిపోతున్న గ్రావెల్ చోరులు



పట్టపగలే అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

ఈ ప్రాంతంలో గతంలో అడపాదడపా గ్రావెల్ తవ్వకాలు జరిగేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక టీడీపీ–జనసేన నాయకులు జూలు విదిల్చారు. అటవీశాఖ, ఏపీఐఐసీ అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని ఏడాదిగా అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. పగలూ రాత్రీ తేడా లేకుండా ఏపీఐఐసీ, ప్రభుత్వ భూముల్లోకి చొరబడి, యంత్రాల సాయంతో ఇష్టానుసారం గ్రావెల్‌ను తవ్వుకుంటున్నారు. టిప్పర్లతో మరో ప్రాంతానికి తరలించి అక్కడి ప్రైవేట్ స్థలంలో నిల్వ చేసుకుని, సమయం చూసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. అధికారంలో ఉన్న ఇరు పార్టీల నాయకులు కలిసి 'నీకింత.. నాకింత'అన్న చందంగా నరవ కొండ ప్రాంతంలోకి చొరబడి గ్రావెల్‌ను దోచుకుంటున్నారు. రూ.కోట్లు అక్రమంగా అర్జించి పంపకాలు జరుపుకుంటున్నారన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి నరవలోని ప్రకృతి వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

నరవలో గ్రావెల్ తవ్వకాల నియంత్రణకు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నాం. తవ్వకాల వలన పైప్‌లైన్లు దెబ్బతినే పరిస్థితి మా దృష్టికి రాలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. మా సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తాం.

– హరిప్రసూన, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి

'ఉపాధి' వేతనాలు చెల్లించాలని ఆందోళన



తానాంలో పని ప్రదేశంలో వేతనాల కోసం ఆందోళన చేస్తున్న ఉపాధి కార్మికులు

పరవాడ: ఉపాధిహామీ పథకం కార్మికులకు చెల్లించాల్సిన 6 వారాల వేతనాలను వెంటనే చెల్లించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తానాం గ్రామంలో పని ప్రదేశంలో సిటు ఆధ్వర్యంలో ఉపాధి కార్మికులతో కలిసి బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గనిసెట్టి మాట్లాడుతూ వేతనాలు చెల్లించకపోవడంతో ఉపాధి కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించాలన్నారు. ఉపాధి కార్మికులపై వేధింపులు నిలిపివేయాలన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధించాలి



సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వేణుగోపాల్

పెందుర్తి: విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించేలా వినూత్న రీతిలో బోధన చేయాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు అధ్యాపకులు నిరంతరం ప్రయత్నించాలన్నారు. అబాహూనా మెకాట్రానిక్స్ వ్యవస్థాపకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో రోజురోజుకూ జరుగుతున్న మార్పులను విద్యార్థులకు పరిచయం చేయాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని తగిన లక్ష్యం వైపు ప్రోత్సహించాలన్నారు. పలు అంశాలపై చర్చించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమిలో కొనసాగుతున్న విభేదాలు

- ఎమ్మెల్యే పంచకర్ల పినగాడి పర్యటనలో కానరాని గండి బాబ్జీ వర్గీయులు
- కానీ 'కూటమిలో విబేధాల్లేవు' అంటూ ఎమ్మెల్యే బీరాలు
- పినగాడిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

పెందుర్తి: నియోజకవర్గంలో అధికార టీడీపీ, జనసేన కూటమి నాయకుల మధ్య విబేధాలు కొనసాగుతున్నాయి. పెందుర్తి మండలం పినగాడి పంచాయతీలో జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు పర్యటించిన వేళ కూటమి ప్రభుత్వ ప్రధాన భాగస్వామి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ వర్గీయులను దూరం పెట్టారు. తొలి నుంచీ అధికారిక కార్యక్రమాలకు గండి బాబ్జీ వర్గాన్ని దూరం పెడుతున్న ఎమ్మెల్యే తాజా పర్యటనలో కూడా తన పంథాను కొనసాగించారు. ఎమ్మెల్యే పర్యటనలో ఎక్కడా బాబ్జీ వర్గీయులు కానరాలేదు. కాగా 'కూటమి ప్రభుత్వంలో స్థానికంగా నాయకుల మధ్య మనస్పర్థలు ఉన్నాయని జరుగుతున్న ప్రచారం అవాస్తవం. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులంతా నా వాళ్లే. నియోజకవర్గాన్ని అందరి అమోదంతో అన్నిరంగాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తా'నంటూ ఎమ్మెల్యే చెప్పుకోవడం గమనార్హం. ఏడాదిలో నియోజకవర్గంలో రూ.229 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కోట్నివానిపాలెంలో వైఎస్సార్‌సీపీ హయాంలో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన మంచినీటి పథకంతో కలిపి పినగాడి పంచాయతీలో రూ.1.50 కోట్ల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, కాలువలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్న తమ కార్యకర్త చెబితే వెంటనే ఆ సమస్యను పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డీఈ పీవీ రమణమూర్తి, ఏఈ లక్ష్మణ్, నాయకులు బి.హరగోపాల్, కరక దేముడు, గొర్లె రామునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

గండి బాబ్జీ వర్గీయుల దుమ్మా

కూటమిలో స్పర్థలు లేవని చెబుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పినగాడిలో పర్యటించిన వేళ టీడీపీ సీనియర్ నాయకులెవరూ ఆయన వెంట లేరు. బండారు సత్యనారాయణమూర్తి వర్గీయుడైన హరగోపాల్‌కు రమేష్‌బాబు ప్రాధాన్యత ఇవ్వడంతో పంచాయతీలోని గండి బాబ్జీ వర్గీయులు ఈ కార్యక్రమానికి దుమ్మా కొట్టారు. అదే సమయంలో వారంతా పంచాయతీలో టీడీపీ సుపరిపాలన కార్యక్రమ ప్రచారంలో ఉండటం గమనార్హం. దీంతో వేదిక మీద పంచకర్ల 'కూటమిలో మనస్పర్థలు ఉన్నాయన్నది అబద్ధం'అన్న మాట అబద్ధమే అంటూ స్థానికులు గుసగుసలాడుకున్నారు.



కోట్నివానిపాలెంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా గరుడ సేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపి, విశేష హారతులందించారు. పూజలో పాల్గొన్న భక్తులచే గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



తలంబ్రాలు ఘట్టంలో అర్చకులు

ప్రధాన కూడళ్లలో ప్రమాదాల నియంత్రణకు చర్యలు

పరవాడ: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారిలోని లంకెలపాలెం కూడలిని ప్రమాదరహిత కూడలిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సమన్వయంతో ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా ప్రమాదకర కూడళ్ల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించి, సహకరించాలని కోరారు. ప్రజల నుంచి సలహాలు, అభిప్రాయాలు తీసుకుంటున్నామన్నారు. లంకెలపాలెం కూడలిలో ఇటీవల జరిగిన ప్రమాదాలను పరిగణలోకి తీసుకుని అక్కడ ప్రమాదాల నియంత్రణకు పలు భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గాజువాక నుంచి అనకాపల్లి వైపు వచ్చే వాహనాలు అతి వేగంగా రావడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. లంకెలపాలెం జంక్షన్‌కు చేరేలోపు వాహనాల వేగాన్ని నియంత్రించడానికి చర్యలు చేపట్టామన్నారు. లంకెలపాలెం కూడలికి 400 మీటర్ల ముందు రెండు వైపులా క్రిస్ క్రాస్ డ్రమ్ములు, స్టాపర్లను ఏర్పాటు చేసి, వాటిపై రేడియం స్టిక్కర్లు, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులను అమర్చినట్లు పేర్కొన్నారు. కూడలిలో రాత్రి సమయంలో వాహనాలకు ముందస్తుగా జాగ్రత్తలను సూచించే ఎల్లో బ్లింకర్ లైట్‌ను ఏర్పాటు చేశామన్నారు. జంక్షన్ దాటిన తరువాత వేగ నియంత్రణ కోసం ఎన్‌హెచ్‌ఏఐ ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రతి రోజూ డే అండ్ నైట్ షిఫ్ట్‌ల్లో ట్రాఫిక్ మానిటరింగ్ కోసం పోలీసు సిబ్బందిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. వాహనదారుల దృష్టిని ఆకర్షించేలా హెచ్చరిక బోర్డు రూపంలో స్టాపర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.



లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు చేసిన క్రిస్‌క్రాస్ డ్రమ్ములు, స్టాపర్లు

మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు

సబ్బవరం: యువత బంగారు భవిష్యత్తు కోసం మాదక ద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సబ్బవరం సీఐ జి.రామచంద్రరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన, రహదారుల భద్రతపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. దేశంలో యువత అత్యధికంగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. దేశంలో ఇతర ప్రమాదాలు, అనారోగ్యంతో మరణించిన వారికంటే ఎన్నో రెట్లు రోడ్డు ప్రమాద బాధితులే ఉన్నారని తెలిపారు. రహదారుల భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు సత్యనారాయణ, రతన్ ప్రకాష్, ఎంపీ రామకృష్ణ, జాతీయ సేవా సమితి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు సింగ్(ఫైల్)

పెందుర్తి: మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ మూడంతస్తుల భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు. హైదరాబాద్‌కు చెందిన అల్లూరి శ్రీవర్ధన్ సింగ్ సుజాతనగర్‌లోని మయూరి కేఫ్‌లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకున్న సింగ్.. కేఫ్ యాజమాన్యం సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన నివాసానికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో మద్యం సేవించిన సింగ్ ప్రమాదశాత్తు భవనం పైనుంచి పడిపోయాడు. వెంటనే 108కు ఫోన్ చేసి, ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. కేఫ్ ప్రతినిధి సన్యాసిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుని కుటుంబ వివరాలు తెలియరాకపోవడంతో మృతదేహాన్ని కేజీహెచ్‌లో భద్రపరిచినట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

సంకర జాతి పశువులకు థైలీరియా నివారణ టీకాలు



అంతకాపల్లిలో సంకర జాతి పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

సబ్బవరం: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని అన్ని గ్రామాల్లో 3 నెలలు వయసు దాటిన సంకరజాతి పశువులన్నింటికీ థైలీరియా వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని అంతకాపల్లి, బోదువలస గ్రామాల్లో బుధవారం టీకా కార్యక్రమం నిర్వహించి, 185 సంకర జాతి పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో 6 వేల డోస్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. పాడి రైతులంతా తమ వద్ద ఉన్న 3 నెలలు దాటిన ఆడ, మగ సంకర జాతి పశువులకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ప్రభుత్వం రూ.850 విలువ చేసే ఈ టీకా ఉచితం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. థైలీరియా వ్యాధి సంకర జాతి పశువుల్లో గోమారు, పిరుదులు కుట్టడం వలన వస్తుందన్నారు. విపరీతమైన జ్వరం, సరిగా మేత మేయకపోవడం, దవడల కింద గగ్గల వాపు, నీరసం, పాల దిగుబడి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి వల్ల చూడి కట్టిన పశువుల్లో గర్భస్రావం జరగవచ్చన్నారు. వ్యాధి సోకాక వైద్యం అందించినప్పటికీ 90 శాతం పశువులు మృత్యువాత పడతాయని హెచ్చరించారు. అందుకే ముందుగానే రైతులంతా ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుంతల రోడ్డుతో ప్రయాణికుల ఇబ్బందులు



వెన్నలపాలెం జంక్షన్‌లో రోడ్డు మధ్య ఏర్పడిన భారీ గోతులు

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారి వెన్నలపాలెం కూడలిలో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికులను భయపెడుతున్నాయి. రహదారిలో రాకపోకలు సాగిస్తున్న బొగ్గు, బూడిద లారీలతో అడుగుకో గుంత ఏర్పడింది. దీంతో ఫార్మాసిటీ, ఎన్టీపీసీ ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రహదారిలో నిత్యం వందలాది భారీ వాహనాలతో పాటు వేలాది ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. చీకటి పడితే రోడ్డు మధ్యలో పడిన గోతులు కనిపించకపోవడంతో వాహనచోదకులు గోతుల్లో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రాత్రుళ్లు రద్దీగా ఉండే ఈ రహదారిలో గోతుల్ని సత్వరమే పూడ్చాలని ఆర్ అండ్ బీ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదని ప్రయాణికులు వాపోతున్నారు.